క్లుప్తంగా

భూసార పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలి



భూసార పరీక్షలపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: భూసార పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాల సేకరణపై గ్రామ సచివాలయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఏఏలు, ఎంపీఈఓలు పొలాల్లోంచి మట్టి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువుల వాడాలని, పంట వేయాలని సూచించారు.

భూసార పరీక్షలు పూర్తి

ఓర్వకల్లు: ఈ ఏడాది ఖరీఫ్ కాలానికి సంబంధించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భూసార పరీక్షలు పూర్తయినట్లు ఏఈఓ మధు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మండలంలోని ఒక్కో రైతు భరోసా కేంద్రం పరిధిలో 22 నమూనాల చొప్పున మొత్తం 19 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 418 నమూనాలను సేకరించినట్లు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించామన్నారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు.

ప్రభాస్ ఫ్యాన్ చేయూత



ప్లేట్లు, గ్లాసులు, బాటిళ్లు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి

పాణ్యం: ఆదిపురుష్ సినిమా విడుదలను పురస్కరించుకుని సినీ హీరో ప్రభాస్ ఫ్యాన్ అందించిన ప్లేట్లు, గ్లాసులు, బాటిళ్లను మండల పరిధిలోని కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపిరెడ్డి పుల్లారెడ్డి, హెచ్‌ఎం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



విద్యుత్ స్తంభం లేక కర్ర సాయంతో ఏర్పాటు చేసిన తీగలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని వై.ఖానాపురంలోని గిడ్డిమూర్తి ఇంటి ముందు విద్యుత్ స్తంభానికి బదులుగా కర్ర సహాయంతో కొందరు విద్యుత్ తీగలను లాగి కనెక్షన్ తీసుకున్నారు. గాలి, వానలకు తరచూ కర్ర విరిగి తీగలు తెగి ఇళ్ల ముందు పడుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని లైన్‌మెన్‌ను రెండేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కాల్వను పగులగొట్టి.. మట్టితో పూడ్చి!



పొక్లెయిన్ దిగిన చోటా పగిలిన లైనింగ్‌కు ఎర్రమట్టి వేసి కప్పిన దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ లైనింగ్‌ను పగులగొట్టి ఎవరికీ తెలియకుండా ఎర్రమట్టితో కప్పేశారు. గోరుకల్లు నుంచి డోన్‌కు పైపులైన్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణ పనుల్లో భాగంగా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వను దాటించేందుకు పైపులైన్ కోసం కాల్వ మధ్యలో పిల్లర్లు తీసేందుకు పొక్లెయిన్‌ను కాల్వలోకి దించారు. ఈక్రమంలో లైనింగ్ ధ్వంసమైంది. పని పూర్తి చేశాక వచ్చిన చోటే పొక్లెయిన్‌ను ఎక్కించారు. దీంతో లైనింగ్ పూర్తిగా పగిలిపోయింది. ఈ విషయాన్ని దాచిపెట్టి కంపెనీ వారు ఎర్రమట్టి వేసి చేతులు దులిపేసుకున్నారు. ప్రధాన కాల్వను 2,300 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. కాల్వ దెబ్బతినడం వల్ల అధిక నీటిని వదితిలే ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పిల్లర్లను తవ్వేందుకు కాల్వలో దిగిన పొక్లెయిన్

గ్రామాల ముంగిటకే పాలన

- గ్రామ సచివాలయంలో 512 సేవలు
- ఊర్లోనే సమస్యలకు పరిష్కారం
- కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్, దర్శనాలకు ఆన్‌లైన్ సేవలు
- త్వరలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

జగనన్న ప్రభుత్వం గ్రామాల ముంగిటకే పాలన తెచ్చింది. పల్లెపల్లెకూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఏ సమస్యనైనా పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. ఉన్న ఊర్లోనే అన్ని సేవలూ లభిస్తుండటంతో ఇక మండల కేంద్రాలకు వెళ్లే బాధలు తప్పిపోయాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 512 సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయం.. మరో అడుగు ముందుకేసి డ్రైవింగ్ లైసెన్స్, దర్శనాలకు ఆన్‌లైన్ సేవలనూ అందిస్తోంది. త్వరలో రిజిస్ట్రేషన్ సేవలను కూడా గ్రామాల్లోనే అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. – కర్నూలు (న్యూటౌన్)

సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే 512 సేవలు అందుతున్నాయి. అన్ని రకాల ధ్రువపత్రాలను గ్రామ సచివాలయాల్లోనే పొందే అవకాశం అందుబాటులోకి రావడంతో ప్రజలు మండల కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇందులో కొన్ని సేవలు పూర్తిగా ఉచితం కాగా మరి కొన్నింటికి రూ.15 చెల్లించాలి. ఆధార్, ఈకేవైసీ, కుల ధ్రువీకరణపత్రం, డ్రైవింగ్ లైసెన్స్, జనన, మరణ ధ్రువీకరణ పత్రం, 1–బీ అడంగల్, విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఓటరు నమోదు, ఆలయాల్లో దర్శనాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, బస్‌పాస్ వంటి సేవలకు మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పని లేకుండా సచివాలయాల్లోనే జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. త్వరలో రిజిస్ట్రేషన్ సేవలు కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అందుబాటులో సేవలు..

ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వ శాఖల్లో సర్టిఫికెట్లు తీసుకునేందుకు మీ సేవ కేంద్రాలు, ఇంటర్‌నెట్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వచ్చేది. తాజాగా రెవెన్యూ, పంచాయతీ, పోలీసు, వైద్యం, విద్యుత్, ఆలయ, వ్యవసాయం, రవాణా, హౌసింగ్, సంక్షేమం, విద్య, క్రీడలు, టూరిజం ఇలా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అన్ని శాఖలకు చెందిన 512 సేవలకు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను సచివాలయాల్లోనే ఇవ్వడం ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని సచివాలయాల్లో ప్రభుత్వ శాఖలకు సంబంధించి సమాచారాన్ని వెబ్‌సైట్‌కు లింక్ చేశారు. వైఎస్సార్ రైతు భరోసా స్టేటస్, భవన నిర్మాణ అనుమతి, ఎఫ్‌ఐఆర్ కాపీ, ఈ చలానా చెల్లించడం తదితర వందలాది సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చు.

జాబ్‌కార్డులు కూడా..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జాబ్ కార్డులను సచివాలయంలోనే మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ప్రభుత్వం 100 రోజుల పని దినాలను 150 రోజులకు పెంచింది.



ఈ తాండ్రపాడు-2 ఇందిరమ్మ కాలనీలోని గ్రామ సచివాలయం(ఫైల్)

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు	వలంటీర్లు
కోడుమూరు	21	184	329
గూడూరు	9	120	134
సి.బెళగల్	16	117	252
కర్నూలు	25	228	380

సేవలన్నీ సచివాలయంలోనే..



అన్ని గ్రామ సచివాలయాల్లో 512 ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మండల కేంద్రాలకు పనుల నిమిత్తం రావాల్సిన అవసరం లేదు. త్వరలో రిజిస్ట్రేషన్ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయి.

– అజాంఖాన్, ఎంపీడీఓ, కర్నూలు

'సుంకేసుల'లో 1.152 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో కేసీకి నీటి విడుదల నిలిపేశామన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

కోడుమూరు రూరల్: మండలంలో పొలాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు కౌలు గుర్తింపు కార్డులిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జయన్న సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బందితో తహసీల్దార్ జయన్న, ఏఓ రవిప్రకాష్ కౌలు రైతుల గుర్తింపు, కార్డుల మంజూరుపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కార్డుల జారీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఓ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వ సబ్సిడీలతో పాటు, పంట నష్టపరిహారం, గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

పశువులకు బీమా చేయించుకోండి

కర్నూలు (న్యూటౌన్): పశువులకు బీమా చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య పాడి రైతులకు సూచించారు. సోమవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ పశుబీమా చేయించిన ఆవు, గేదెలు మరణిస్తే రూ.30 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు నష్ట పరిహారం అందుతుందన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు ఆవులు, గేదెలకు బీమా వర్తిస్తుందన్నారు. 50 గొర్రెలు, మేకల వరకు బీమా చేయించుకోవచ్చన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక వరం



విద్యాకానుకను పంపిణీ చేస్తున్న మేయర్ బీవై రామయ్య

- మేయర్ బీవై రామయ్య

కల్లూరు: విద్యాకానుక విద్యార్థులకు వరం లాంటిదని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా అమ్మ ఒడి, పౌష్టికాహారం కోసం జగనన్న గోరుముద్ద పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటిని ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయ బృందం, డీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరామ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



మీదివేములలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి



సి.బెళగల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

- మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఓర్వకల్లు: విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆణిముత్యాల కార్యక్రమానికి ఎంపికైన మీదివేముల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గోకారి లాల్, మేఘన, మురళీకృష్ణలకు సోమవారం వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు.ఆయన మాట్లాడుడూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు పద్మనాభరెడ్డి, గ్రామ పెద్దలు సంజీవరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

విద్యాతోనే బంగారు భవిష్యత్

సి.బెళగల్: విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని ఎంపీడీఓ రాముడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాలల్లో నిలిచిన వంశీకృష్ణ(రూ.3 వేలు), రామ్‌శంకర్‌నాయక్ (రూ.2 వేలు), రాముడు (రూ.వెయ్యి)లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సి.బెళగల్, గూడూరు ఎంఈఓ –2లు అదామ్‌బాషా, నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తోందని 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది డిజిటల్ విద్యను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువుకుంటేనే ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడవచ్చన్నారు. అనంతరం లిఖిత, పద్మ కీర్తిరెడ్డి, రీటాకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ బాషా, హుస్సేన్ ఆలం, మహమ్మద్ పాల్గొన్నారు.

'ఆణిముత్యాలు'కు ప్రోత్సాహక బహుమతులు

పాణ్యం: మండల పరిధిలోని బపలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులు అందించారు. మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలు కార్పొరేట్‌ను తలదన్నేలా ఉన్నాయన్నారు. అనంతరం మొదటి మూడు స్థానాలు సాధించిన సునీత(రూ.3 వేలు), వహిదా (రూ.2 వేలు), జ్యోతిప్రియ (రూ.1,000)లకు నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవీ, హెచ్‌ఎం నారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

గడివేముల: మండల కేంద్రంలోని కొత్త పెద్దమ్మ ఆలయం సమీపంలో కొన్నేళ్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారి పక్కనే జనసంచారం అధికంగా ఉన్న చోటే ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, వేరే చోటుకు మార్చాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం వై.ఖానాపురంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కొందరు రైతులు బావులు, బోర్లు, విద్యుత్ ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా దుండగులు అందులోని సామాగ్రిని ఎత్తుకెళ్లడంతో ట్రాన్స్‌కో అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకుండా వదిలివేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు అందించాలని కొందరు, మురుగుకాలువలు ఏర్పాటు చేయాలని మరికొందరు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. తాగునీటి, మురుగు కాలువ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని, విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే త్వరలోనే కోడుమూరు–గూడూరు రోడ్డు పనులను చేపట్టి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, నాయకులు మహేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ఉగ్ర నరసింహులు, ఎల్లాగౌడ్, విజయుడు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

సమావేశం వాయిదా

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో గేటు వసూలుకు సంబంధించి సమావేశం వాయిదా పడినట్లు గ్రామ కార్యదర్శి రాజశేఖర్ సోమవారం తెలిపారు.

పేదలకు పథకాలు చేరువ చేయాలి

గడివేముల: ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సిబ్బందికి సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయాల సిబ్బందితో జగనన్న సురక్ష సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష సేవలు ప్రారంభిస్తారని, 24న క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతుందని తెలిపారు. 30వ తేదీ వరకు ప్రతి వలంటీరు తమ పరిధిలోని 50 గృహాలను సందర్శించి అర్హులై ఉండి కూడా ప్రభుత్వ పథకాలు వర్తించని వారిని గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. జూలై 1 నుంచి నాలుగు వారాల పాటు మండలస్థాయి అధికారుల బృందం గ్రామాల్లోని సచివాలయాలను సదర్శించి, అర్హుల జాబితాలను తయారు చేసి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అబ్దుల్ ఖాలీక్ పాల్గొన్నారు.

'దోపిడీ'పై విచారణ

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్ పాస్‌ల కౌంటర్‌లో గుర్తింపు కార్డుల జారీలో జరుగుతున్న దోపిడీపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పాసుల జారీలో జరుగుతున్న దోపిడీపై సోమవారం 'సాక్షి'లో 'ఇదో రకం దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి.వెంకటరామం స్పందించి విచారణకు ఆదేశించారు. ఎప్పటి నుంచి ల్యామినేషన్ చేయడం లేదు. ఎన్ని రోజుల నుంచి కలర్ ప్రింటర్ వాడడం లేదు. రిపేరుకు వచ్చిన వెంటనే ఎందుకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు, విభిన్నప్రతిభావంతులు, జర్నలిస్టులకు సేవల్లో లోపం ఉన్నా ఎందుకు స్పందించలేదనే అంశాపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కర్నూలు–1డిపో మనేజరు సుధారాణిని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎం, పర్సనల్ ఆఫీసర్, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారులు కూడా సేవా లోపంపై విచారించినట్లు సమాచారం.

సాక్షి ఎఫెక్ట్

స్పందన సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యలను వీలైనంత తర్వగా పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి సిబ్బందికి సూచించారు. సోమవారం ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి తహసీల్దార్ శేషఫణి తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రేషన్‌కార్డు, భూ సమస్యలు, తాగునీరు, మురుగు కాలువలు, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలపై వినతిపత్రాలు వచ్చాయి. ఆమా శాఖల అధికారులకు వాటిని రెఫర్ చేసి వీలైనంత త్వరగా పరిష్కారాలు చూపాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ మల్లేష్ కుమార్, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ పీరయ్య, ఎంఈఓ జ్యోతి, హౌసింగ్, ఇరిగేషన్ ఏఈలు సుమంత్, సూర్యప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సీహెచ్‌ఓ మామహేశ్వరి, వీఆర్వోలు ఉన్నారు.



సి.బెళగల్ స్పందనలో సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

- గూడూరు: స్పందన అర్జీలకు సిబ్బంది వెంటనే స్పందించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఎంపీడీఓ మాధవీలత, ఎంఈఓ సునీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ ఫ్యాక్టరీ వద్ద నిరసన

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో నిర్మించిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీలో భూముల కోల్పోయిన వారికి పరిహారం అందించక పోవడంతో ఫ్యాక్టరీలోని మైనింగ్ వద్ద బాధిత రైతు కుటుంబ సభ్యులు సోమవారం అందోళన నిర్వహించారు. బిలకల గూడూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా, వెంకటసుబ్బయ్య, బాలనాగన్న, ఆనందం, చిన్న సుబ్బన్నలకు చెందిన పొలాన్ని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి తీసుకున్నారు. మైనింగ్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి రహదారికి రాళ్లను అడ్డం పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి తిరుగుతున్నా పరిహారం ఇవ్వలేదని వాపోయారు. పరిహారం ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. స్పందించిన జిందాల్ యాజమాన్యం బాధిత రైతుల వద్దకు వచ్చి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. త్వరలోనే ఫ్యాక్టరీ సీఈఓ వద్దకు తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (న్యూటౌన్): విద్యాశాఖలో పలువురిని పదోన్నతి వరించింది. కల్లూరు మండలం బస్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా పని చేస్తున్న జి.విజయకుమారికి కర్నూలు అర్బన్ ఎంఈఓ–2గా, గోనెగండ్ల మండల ఎంఈఓగా ఉన్న కె వినోద్‌కుమార్ కర్నూలు రూరల్ –2 ఎంఈఓగా సోమవారం ప్రభుత్వం నియమించండంతో వారు బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జి.విజయకుమారి



కె.వినోద్‌కుమార్

- ఓర్వకల్లు ఎంఈఓ –2 గా ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: మండలంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ)గా ఓంకార యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణగిరి మండలం ఎరుకల చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా ఉన్న ఆయనకు ఎంఈఓ –2గా ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఓర్వకల్లుకు నియమించింది.



ఓంకార యాదవ్

- పాణ్యం ఎంఈఓ–2గా సుబ్రమణ్యం

పాణ్యం: మండల ఎంఈఓ–2గా ఎం.సుబ్రమణ్యం నియమితులయ్యారు. సంజామల మండలం కమలపూరి పాఠశాలలో పని చేస్తున్న ఆయనను పాణ్యం ఎంఈఓ–2గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.



ఎం.సుబ్రమణ్యం

- సి.బెళగల్: మండల విద్యాశాఖ రెండో అధికారిగా ఆదామ్‌బాషా బాధ్యతలు స్వీరించారు.